క్లుప్తంగా

నేడు మండల అభివృద్ధి ప్రణాళిక సమావేశం

ఐరాల: స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 11 గంటలకు 2024–25వ సంవత్సరానికి సంబంధించిన మండల అభివృద్ధి ప్రణాళికపై సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కుసుమ కుమారి తెలిపారు. ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, జెడ్పీటీసీ, సర్పంచులు, కో–ఆప్షన్ మెంబర్, ఎంపీటీసీ, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు.

రాప్తాడు సిద్ధం సభకు తరలిన కార్యకర్తలు



బంగారుపాళెం: రాప్తాడు సభకు వెళ్తున్న మొగిలి కార్యకర్తలు

బంగారుపాళెం: అనంతపురం జిల్లా రాప్తాడులో ఆదివారం వైఎస్సార్ సీపీ నిర్వహించిన సిద్ధం సభకు బంగారుపాళెం మండలం నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. మండలంలోని 41 గ్రామ పంచాయతీల నుంచి 50 వాహనాల్లో వెళ్లారు.

తహసీల్దార్ కార్యాలయంలో స్పందన

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా ప్రజలు తమ సమస్యలను వినతుల ద్వారా అధికారులకు నేరుగా తెలియజేయవచ్చని ఆయన చెప్పారు.

రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్‌కు పూతలపట్టు విద్యార్థి



బహుమతి అందుకుంటున్న విద్యార్థిని వైష్ణవి

పూతలపట్టు : రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు పూతలపట్టు మండలం అయ్యప్పగారిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన వైష్ణవి ఎంపికై ంది. చిత్తూరులోని పీఈఎస్ పబ్లిక్ స్కూల్‌లో ఈ నెల 14 నుంచి 16 వరకు నిర్వహించిన సైన్స్ ఫేర్‌లో ఇంటలిజెంట్ ప్రాజెక్టును ప్రదర్శించింది. ఆమెను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

నేడు ఆసరా చెక్కు పంపిణీ

పూతలపట్టు : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో సోమవారం ఉదయం 10:30 గంటలకు ఆసరా చెక్కు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ప్రసన్నకుమారి తెలిపారు. ఇందులో నియోజకవర్గ సమన్వయ కర్త డాక్టర్ సునీల్ కుమార్ హాజరవుతారని పేర్కొన్నారు. మండలంలోని పొదుపు సంఘాల మహిళలు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

28న బంగారుపాళెంలో వాలీబాల్ టోర్నమెంట్

బంగారుపాళెం : మండల కేంద్రమైన బంగారుపాళెం దళితవాడలో ఈ నెల 28న వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గుంతూరు రోడ్డు పక్కన ఉన్న సీఎస్ పురం సింగిల్‌విండో కార్యాలయ ఆవరణలో పోటీలు ప్రారంభమవుతాయన్నారు. టోర్నీలో పాల్గొనదలచిన జట్లు రూ.555 ప్రవేశ రుసుము చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.10,116, రెండో బహుమతిగా రూ.7,116, మూడో బహుమతిగా రూ.5,116, నాలుగో బహుమతిగా రూ.3,516 అందజేస్తామని పేర్కొన్నారు. వివరాలకు 9347166929, 9160718768 సంప్రదించాలని కోరారు.

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా నరేష్‌కుమార్



నరేష్‌కుమార్

తవణంపల్లె: మండల తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి బదిలీ కావడంతో డిప్యూటీ తహసీల్దార్ నరేష్‌కుమార్‌ను ఇన్‌చార్జ్‌గా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన బాధ్యతలు చేపట్టారు. మండలంలో ప్రజల రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వివరించారు.

21న మండల సర్వసభ్య సమావేశం

తవణంపల్లె: ఈ నెల 21వ తేదీన మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెంకటేశ్వర్లు తెలిపారు. ఎంపీపీ గీతారెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

సర్కారు బడుల్లో డిజిటల్ విప్లవం

- కార్పొరేట్‌కు దీటుగా సౌకర్యాలు
- ప్రాథమిక పాఠశాలల్లో స్మార్ట్ టీవీలు
- ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఐఎఫ్‌పీల వినియోగం
- 321 మంది విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ
- ఉపాధ్యాయులకు సులభతరం అవుతున్న బోధన



ఐఎఫ్‌పీ ద్వారా బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

ఐరాల: బోధనా పద్ధతుల్లో, మౌలిక వసతుల్లో ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు పాఠశాలలతో పోల్చుకునేవారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత దీనికి పూర్తి భిన్నమైన పరిస్థితి నెలకొంది. మన బడి నాడు– నేడు ద్వారా కార్పొరేట్‌ను తలదన్నేలా ప్రభుత్వ పాఠశాల్లో మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేశారు. బోధనలోనూ సాంకేతిక విధానానికి శ్రీకారం చుట్టారు. బట్టీ విధానానికి స్వస్తి చెబుతూ ప్రాక్టికల్ విధానంలో విద్యార్థులకు విద్యా బోధన అందిస్తున్నారు. ప్రాథమిక పాఠశాలలకు ఎల్‌ఈడీలను, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు ఐఎఫ్‌పీలను, 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు బైజూస్ కంటెంట్ కలిగిన ట్యాబ్‌లను అందజేశారు. విద్యార్థులు ఇంటి వద్దనే ఆడియో, వీడియోల ద్వారా పాఠాలను వినేందుకు అవకాశం కల్పించారు. ప్రైవేటు, కార్పొరేట్‌లో లేని విధంగా ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ (ఐఎఫ్‌పీ) డిస్‌ప్లేలను ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేశారు. విద్యా వ్యవస్థలో ఇదొక విప్లవాత్మక మార్పుగా విద్యావేత్తలు పరిగణిస్తున్నారు.

ట్యాబ్‌లతో పాటు యాక్ససిరీస్

మండలంలోని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న 321 మంది విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ట్యాబ్‌లతో పాటు యాక్ససిరీస్, ఓటీజీ కనెక్టర్స్, అడాప్టర్స్, 64 జీబీ ఎస్‌డీ కార్డులు ఇవ్వనున్నారు. పాఠాలు చెప్పే టీచర్లకు సైతం ట్యాబ్‌లను అందించారు.

ట్యాబ్‌లలో యాప్స్ ఇలా..

ట్యాబ్‌లలో విద్యార్థులకు అవసరమైన 7 రకాల యాప్‌లను అందుబాటులో ఉంచారు. వైఫై మేనేజర్‌తో పాటు డిక్షనరీ, బైజూస్ కంటెంట్, డులింగో యాప్, ఏపీ ఈ– పాఠశాల వంటి యాప్‌ల ద్వారా విద్యార్థులకు ఆడియో, వీడియోల ద్వారా విద్యను అందించే విధంగా ట్యాబ్‌లను రూపొందించారు.

బైజూస్ కంటెంట్ యాప్

ట్యాబ్‌లలో బైజూస్ కంటెంట్ యాప్ ద్వారా 4వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు అన్ని సబ్జెక్టులకు సంబంధించిన పాఠాలు అందులో ఉంటాయి. ప్రీలోడెడ్ కంటెంట్‌తో పాటు 64 జీబీ కంటెంట్ అందుబాటులో ఉంచడంతో ఆఫ్‌లైన్‌లోనూ వీడియోలను వినే సదుపాయాన్ని కల్పించారు. చిన్న చిన్న పరీక్షల ద్వారా విద్యార్థుల్లో అవగాహన సామర్థ్యాన్ని పెంచుకునేందుకు బైజూస్ ప్రీమియం యాప్ ఎంతగానో దోహదపడుతుంది.

వైఫై మేనేజర్

పాఠశాల పరిసరాల్లోకి వచ్చిన వెంటనే ట్యాబ్‌ను ఆన్ చేస్తే ఆటోమెటిక్‌గా వైఫై ఓపెన్ అవుతుంది. పాఠశాలల్లో ప్రభుత్వం ఇంటర్నెట్ సదుపాయం కల్పించడంతో ఆన్‌లైన్‌లో పాఠాలు వినేందుకు, వీడియో పాఠాలను చూసేందుకు వీలవుతుంది.

డిక్షనరీ యాప్

విద్యార్థులు ఇబ్బంది పడకుండా ఇంగ్లిషు నేర్చుకునేందుకు డిక్షనరీ ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రభుత్వం పాఠశాలల్లో ఆంగ్ల మీడియం విద్యను అమలు చేస్తోంది. విద్యార్థులు పదాల అర్థాలకు ఇబ్బంది పడకూడదని ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ అందించింది. అదే డిక్షనరీని ట్యాబ్‌లో చూసుకునేందుకు కూడా వీలు కల్పించారు.

స్విఫ్ట్ చార్ట్

స్విఫ్ట్ చార్ట్ విద్యార్థులకు ఇది ట్యూటర్ మాదిరిగా పని చేస్తుంది. ఇంటి దగ్గర చిన్న చిన్న అసైన్‌మెంట్స్, ప్రాజెక్టులు, పూర్తి చేసేందుకు స్విఫ్ట్ బాగా ఉపయోగపడుతుంది. ఒక వేళ ఏదైనా ఒక పాఠ్యాంశం అర్థం కాకపోతే తిరిగి ఆ అంశాన్ని ట్యాబ్‌లోని ఆ యాప్‌లో టైప్ చేస్తే పూర్తి స్థాయి సమాచారంతో ఓపెన్ అవుతుంది. అప్పుడు పాఠాలను మరొకసారి వినే అవకాశం ఉంటుంది.



ట్యాబ్‌లో సరికొత్త యాప్స్

ఏపీ ఈ– పాఠశాల యాప్

రాష్ట్రంలోని వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న కొంతమంది నిపుణులను విద్యాశాఖ ఎంపిక చేసి వారితో తెలుగు, ఇంగ్లిషు, హిందీ సబ్జెక్టులకు సంబంధించి పాఠాలను రికార్డు చేసి వీడియోలను తయారు చేసింది. ఆ వీడియోలన్నీ ఏపీ ఈ–పాఠశాల యాప్‌లో ఉన్నాయి. పాఠాలు అర్థం కాకపోతే తిరిగి చూసుకునే అవకాశం ఉంది.

సులభంగా అర్థం అవుతున్నాయి



స్కూల్‌లో చెప్పిన పాఠం అర్థం కాకపోతే మ్యాన్‌వల్‌గా రాసి చూపిస్తున్నారు. పాఠాలను ఆడియోలు, వీడియోల ద్వారా వినే అవకాశం కల్పించడంతో సులభంగా అర్థమవుతున్నాయి. అసైన్‌మెంట్ ఉంటే వాటిని నేర్చుకునేందుకు ట్యాబ్‌లు ఉపయోగపడుతున్నాయి.

– గాయత్రి, 8వ తరగతి, ఐరాల

నేర్చుకోవాలనే ఆసక్తి పెరిగింది



ఐఎఫ్‌పీ ద్వారా పాఠాలు నేర్చుకోవడం సులభంగా ఉంది. పాఠంలో సందేహం ఉంటే ఇంట్లో ట్యాబ్‌ల ద్వారా వాటిని నివృత్తి చేసుకోగలుగుతున్నాం. ట్యాబ్‌లు, ఐఎఫ్‌పీలు వచ్చిన తర్వాత పాఠాలు మరిన్ని నేర్చుకోవాలనే ఆసక్తి పెరిగింది. చాలా సంతోషంగా ఉంది.

– మౌనిక, 8వ తరగతి, ఐరాల

పాఠ్యాంశాలను మరిచిపోరు



పాఠం అర్థం కాకపోతే వీడియోల రూపంలో ఉన్న పాఠ్యంశాన్ని చూపిస్తాము. దీంతో బాగా అర్థం చేసుకుంటారు. అప్పటికీ అర్థం కాకపోతే మ్యాన్‌వల్‌గా రాసి చూపిస్తాము. అర్థం కాని పాఠాలను రివిజన్ చేయడం ద్వారా వారు మరచిపోలేరు. ప్రాక్టికల్‌గా పాఠం సారాంశం అర్థమవుతుంది.

– సుబ్రమణ్యం, బయాలజీ టీచర్, ఐరాల

ట్యాబ్‌లు పంపిణీ చేశాం



8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌లు అందించాము. ఎస్‌డీ కార్డు మాత్రం రావాల్సి ఉంది. అదివస్తే అన్ని ట్యాబ్‌లలో ఇన్‌స్టాల్ చేసి ఇస్తాము. ఈ ట్యాబ్‌లలో 7 యాప్‌లు ఉన్నాయి. విద్యార్థులకు సాంకేతికపరమైన విద్యనందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

– రుషీంద్రబాబు, ఎంఈవో, ఐరాల

ఇంటి వద్ద కూడా..



ఐఎఫ్‌పీలు, ట్యాబ్‌ల వల్ల బోధన సులభమైంది. విద్యార్థులు ఇంటి వద్ద కూడా ట్యాబ్‌ల ద్వారా పాఠాలు నేర్చుకుంటున్నారు. సందేహం ఉంటే టీచర్‌కు ఫోన్ చేసి నివృత్తి చేసేందుకు ట్యాబ్‌లు ఉపయోగపడుతున్నాయి. ఐఎఫ్‌పీల వల్ల పాఠంలోని అంశాన్ని త్వరగా గ్రహించగలుగుతున్నారు.

– దామోదర్‌నాయుడు, ఎంఈవో, ఐరాల

ఘనంగా మధ్వాచార్యుల జయంతి



మధ్వాచార్యుల పూజకు సామగ్రి అందజేస్తున్న ఈవో వెంకటేశు

కాణిపాకం(యాదమరి) : కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ఆదివారం ద్వైతమతం మధ్వాచార్యుల జయంతిని ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారి కల్యాణ వేదికలో మధ్వాచార్యుల చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. జీవుడు, దేవుడు వేర్వేరని, జీవ, పరమాత్మ రెండుగా ఉంటాయని చెప్పే ద్వైతమతాన్ని మధ్వాచార్యులు నెలకొల్పారని వేదపండితులు వివరించారు. ఆయనను వాయుదేవుడి అంశగా భావిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో వెంకటేశు, ఆలయ అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.

నేడు మొగిలి శివాలయంలో రాహుకేతు పూజలు

బంగారుపాళెం : మండలంలోని మొగిలి శివాలయంలో సోమవారం రాహు కేతు పూజలు నిర్వహించనున్నట్టు ఈవో మునిరాజు తెలిపారు. రాహుకాల సమయం ఉదయం 7.30 నుంచి 9 గంటల మధ్య రాహు, కేతు, సర్పదోష నివారణ పూజలు చేస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దోష నివారణ చేసుకోవాలని కోరారు.

వైభవంగా లక్ష్మీనారాయణస్వామి కల్యాణం



శ్రీదేవి, భూదేవి సమేత నారాయణస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

గంగాధర నెల్లూరు: మండలంలోని వేపంజేరి గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మి నారాయణ స్వామివారి కల్యాణోత్సవం వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం లక్ష్మీనారాయణ స్వామి వారికి సుప్రభాతం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులు అయిన శ్రీదేవి, భూదేవి సమేత నారాయణస్వామికి పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేక అలంకరణలతో వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ కల్యాణోత్సవాన్ని భక్తులు కనులవిందుగా వీక్షించారు. కార్యక్రమంలో చిత్తూరు నగరానికి చెందిన సింధుప్రియ, కీర్తి ఉభయదారులుగా వ్యవహరించగా, అనంతరం ఆలయ మర్యాద ప్రకారం ఉభయదారులకు పట్టువస్త్రాలతో సత్కరించి, తీర్థప్రసాదాలు వేద ఆశీర్వచనం అందజేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ నల్ల వెంకటేషులు రెడ్డి, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

అందరికీ ధన్యవాదాలు



సిద్ధం సభకు బయలుదేరిన జెడ్పీ వైస్ చైర్మన్

యాదమరి: అనంతపురం జిల్లా రాప్తాడులో ఆదివారంనిర్వహించిన సిద్ధం కార్యక్రమాన్ని విజయవంతం చేసిన యాదమరి మండల వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు చిత్తూరు జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్ ధనుంజయ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. సీఎం జగనన్న హాజరైన సిద్ధం సభను విజయవతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవడం సంతోషంగా ఉందన్నారు.

కాణిపాకంలో నిత్యభజనలు నిర్వహించాలి



మాట్లాడుతున్న కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

కాణిపాకం(యాదమరి) : కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద నిత్య భజనలు నిర్వహించాలని జిల్లా కళాకారులు డిమాండ్ చేశారు. వారు ఆదివారం అగరంపల్లె ఆర్చీ నుంచి భజన చేస్తూ ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం స్వామి వారి ఆస్థాన మండపంలో సమావేశమయ్యారు. కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగన్మోహన్, అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయ శంకర స్వామి మాట్లాడారు. స్వామి నిత్యనామ సంకీర్తన ఆలపించాలన్న కళాకారుల కోరికను యాజమాన్యం ఆమోదించాలన్నారు. ఇందులో భాగంగా వెంటనే వేదికను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆలయ ఏఈవో హరిమాధవరెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు మురళి, కమిటీ సభ్యులు నాగరాజు, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు రామచంద్రన్, కార్యదర్శి రవికుమార్, కోశాధికారి రాజేంద్ర నాయుడు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదం

పుంగనూరు: మండలంలోని ఇటుకనెల్లూరులో అగ్నిప్రమాదం చోటుచేసుకుని చెట్లు కాలిపోయాయి. వివరాలు..నాగరాజుకు చెందిన మామిడితోట, నీలగిరితోటలో ఆదివారం సాయంత్రం మంటలు చెలరేగాయి. ఎవరో ధూమపానం చేసి బీడీ లేదా సిగరెట్ ముక్క పడేయడంతో వేసవి తీవ్రత ఉండటం మూలాన మంటలు రేగినట్లు తెలుస్తోంది. సమాచారం అందడంతో అగ్నిమాపకశాఖ అధికారి సుబ్బరాజు తన సిబ్బందితో వెళ్లి మంటలను ఆర్పివేశారు. అప్పటికే ప్రమాదంలో రూ.20 వేల వరకు నష్టం వాటిల్లినట్లు ఆయన తెలిపారు.

వృద్ధులకు చీరల వితరణ



వృద్ధులకు చీరలు, పంచెలు వితరణ చేస్తున్న మునిప్రసాద్

కార్వేటినగరం: మండలకేంద్రం కార్వేటినగరంలోని మండపం వీధికి చెందిన శ్రీనివాసులు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు మునిప్రసాద్, లక్ష్మీ దంపతులు ఆదివారం రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలోని 32 మంది వృద్ధులకు చీరలు, పంచెలు, టవళ్లు వితరణ చేశారు. ఈ సందర్భంగా దాత మునిప్రసాద్ మాట్లాడుతూ అనాథ ఆశ్రమాల్లో ఉన్న వృద్ధులను అక్కున చేర్చుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం అన్నదానంతో పాటు పండ్లు, స్వీట్లు, వస్త్రదానం చేశారు. కార్యక్రమంలో మధు, బాలకృష్ణ, గురుస్వామి, పలువురు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నంది వాహనంపై కాశీ విశ్వేశ్వరుడి విహారం



పలమనేరు: పట్టణంలోని శివాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారు అధికార నంది వాహనంపై పట్టణంలోని వీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. తొలుత ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, అభిషేకాల అనంతరం వాహనంపై ఊరేగారు. ప్రజలు కర్పూర నీరాజనాలు పూజలు చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వీరభద్ర, గోపాలక్రిష్ణారెడ్డి, హరీష్‌రాయల్, ఆలయ ఈఓ కమలాకర్, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను పరిరక్షించుకోవాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు గంగరాజు

పుత్తూరు: కార్మిక చట్టాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గంగరాజు అన్నారు. ఆదివారం స్థానిక విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల భవనంలో అంగన్‌వాడీలకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 44 కార్మికుల చట్టాలను కాలరాసి, కార్మిక జీవితాలతో ఆటలాడుతోందని ఆరోపించారు. యాజమాన్యాలకు అనుకూలంగా 4 కోడ్‌లను తీసుకురావడం జరిగిందన్నారు. వ్యవసాయ రంగానికి సంబంధించి మూడు నల్ల చట్టాలను తీసుకొచ్చిందన్నారు. మత రాజకీయాలు చేస్తున్న బీజేపీకి రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని కోరారు. రాష్ట్రప్రభుత్వం అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వెంకటేష్, లక్ష్మీ, నరసమ్మ, ధనకోటి, మమత తదితరులు పాల్గొన్నారు.

మామిడి.. వచ్చేనా దిగుబడి!

- లేటుగా వస్తున్న పూత
- ముమ్మరంగా సస్యరక్షణ చర్యలు
- పర్యవేక్షిస్తున్న ఉద్యానవన అధికారులు
- ఆందోళనలో రైతన్నలు



కేబీఆర్‌పురంలో కొద్దిపాటి పూతతో కనిపిస్తున్న మామిడి తోట



చెర్లోపల్లిలో మందులు పిచికారీ చేస్తున్న రైతులు

పుత్తూరు: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ప్రధాన వాణిజ్య పంట మామిడి. సుమారు లక్షన్నర ఎకరాల్లో సాగవుతోంది. ఏటా జనవరిలో పూత వికసించి పక్వానికి రావడం ఆనవాయితీ. ఈఏడాది జనవరిలో పూత రాకపోవడంతో రైతులు ఆందోళన చెందారు. దీనిపై ఉద్యానవన శాఖ అధికారులు తోటల్లో క్షేత్రస్థాయి పరిశీలనలు చేపట్టారు. డిసెంబర్ నెలలో కురిసిన అకాల వర్షాల కారణంగా తోటల్లో నేటికీ తేమశాతం ఉన్న కారణంగానే పూత రాలేదని నిర్ధారించారు. పూత రావడానికి సస్యర్క్షణపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. అధికారుల సూచనల మేరకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టడంతో ఫిబ్రవరి రెండవ వారం నుంచి పూత రావడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. ఒకటి, అర తోటల్లో 60 శాతం పూత కనిపిస్తున్నా చాలావరకు బెంగళూరు రకం తోటల్లో 30 నుంచి 40 శాతం మాత్రమే పూత రాగా, చందూర తోటల్లో 20 శాతానికి మించలేదు. పూర్తిస్థాయిలో పూత రావాల్సి ఉంది. ఆలస్యంగా వస్తున్న పూత సైతం ఏమేరకు నిలబడి పిందె కడుతుందో అనే అనుమానాలు రైతులను వెంటాడుతున్నాయి. ఈ దశలోనూ మామిడి రైతులు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా తగిన జగ్రత్తలు పాటించాలని ఉద్యానవన శాఖ అధికారులు సూచిస్తున్నారు.

సస్యరక్షణ తప్పనిసరి..



మామిడి చెట్లకు పూత పుష్కలంగా రావడానికి పొటాషియం నైట్రేట్ 10 నుంచి 15 గ్రాములు ఒక లీటరు నీటిలో కిలిపి, 10 గ్రాముల యూరియా, ఫార్ములా–4 సూక్ష్మకాలు 5 గ్రాములు ఒక లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలి. లేత పూత దశలో తేనె మంచు పురుగు, పేను బంక సమస్య ఎక్కువగా ఉంటుంది. దీని నివారణకు ఇమిడాక్లోపిడ్ 0.5 మి.లీ.లీటరు నీటితో కలిపి పూత తడిచేలా పిచికారీ చేయాలి. పిందె ఏర్పడిన తర్వాత మచ్చ తెగులు, తామర పురుగుల సమస్య తలెత్తే అవకాశం ఉంది. ఈ దశలో పిందె రాలకుండా ఉండడానికి ప్లానోటిక్స్ 1 మి.లీ. మందును 4.5 లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలి. పైసూచనలు పాటిస్తే నాణ్యమైన దిగుబడి రావచ్చు.

– వెంకటసౌజన్య, ఉద్యానవన శాఖ అధికారి, పుత్తూరు

సూచనలు పాటిస్తున్నాం



ఉద్యానవనశాఖ అధికారుల పర్యవేక్షణ బాగుంది. వారి సలహాలు, సూచనలు పాటిస్తున్నాం. తూర్పు మండలాల్లో మామిడి తోటలు పెద్దసంఖ్యలో ఉన్నాయి. ఇందుకు అనుగుణంగా రైతులకు మామిడి రైతులకు క్రిమిసంహారక మందులు, స్ప్రేయర్లు, ట్రేలు, టార్పాలిలన్ పట్టలు, పీవీసీ పైపులను సైతం సబ్సిడీ కింద ఇచ్చి, చిన్న, సన్నకారు రైతులను ప్రోత్సహించాలి. ఇందుకు ఆర్‌బీకేలను కేంద్రంగా చేసుకొని సరఫరా చేయాలి.

– టి.కేశవులు, అధ్యక్షుడు, కేబీఆర్‌పురం మామిడి రైతు సొసైటీ, పుత్తూరు మండలం

దిగుబడిపై ఆశతో ఉన్నాం..



ఈఏడు మామిడి దిగుబడిపై ఆశతోనే ఉన్నాం. పూత ఆలస్యంగా వస్తోంది. సస్యరక్షణ పనులు చేపడుతున్నాంము. కొంత దిగుబడి తగ్గినా, గత ఏడాదికన్నా మెరుగైన ఫలితం వస్తుందని ఆశిస్తున్నాం. 90 శాతం సబ్సిడీతో అందించిన డ్రిప్, అన్‌డ్రిప్ పరికరాల సరఫరాను కొనసాగించాలి. ధరల విషయంలో ప్రభుత్వం చొరవ తీసుకొని, రైతుకు గిట్టుబాట ధర కల్పించాలి.

– ఎస్.లక్ష్మీపతి, రైతు, చెర్లోపల్లి, పుత్తూరు మండలం